శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఘనంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



**కోవూరు జనవరి 13, ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న అరవింద రైసుమిల్లు ప్రాంతంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయిలో ఎడ్ల ప్రదర్శన పోటీలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ పోటీలను పడుగుపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి , వేమారెడ్డి భరత్‌కుమార్ రెడ్డిలు పారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా కనుమరుగవుతున్న సంస్కృతి సంప్రాదాయలకు రైతు సమన్వయ కమిటీ పెద్ద పీట వేసిందన్నారు. గత మూడు దశాబ్దాలకు పైగా కోవూరు బండ్ల సంఘం, కోవూరు రైతు సమన్వయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఈ ఎడ్ల పోటీలు నిర్వహించడం ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహంగా ప్రకాశం, చీరాల, బాపట్ల జిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా రైతులు ఉత్సాహంగా రావడం జరుగుతుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ పోటీలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న రైతు సమన్వయ సంఘాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, కొడవలూరు సీఐ సురేంద్రబాబు ఎస్సైలు రంగనాథ్ గౌడ్, అంజిరెడ్డిలు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ సంఘం సభ్యులు మల్లిఖార్జునరెడ్డి, నరేంద్రరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి , సుబ్బయ్య, శ్రావణ్‌రెడ్డి, ఎం. సుధాకర్, వై. మదన్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు. ఈ పోటీకి న్యాయ నిర్ణేతగా ప్రవీణ్ వ్యవహరించారు.

## ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలి



**కావలి, జనవరి13 ప్రభాతవార్త** ప్రతిఒక్కరి జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని, కావలి నియోజకవర్గ ప్రజలందరికి సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారు విశేషంగా జరుపుకునే పండుగ సంక్రాంతేనన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో శుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నాయకులు ఎమ్మెల్యే దగుమాటి కార్యాలయానికి విచ్చేసి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దగుమాటిపై అభిమానంతో తెలుగుదేశంపార్టీ యువనాయకుడు జేదిత్య ప్రింట్ చేయించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రెడ్డిసంక్షేమసంఘం క్యాలెండర్‌నుకూడా ఎమ్మెల్యే దగుమాటి ఆవిష్కరించారు. రెడ్డిసంక్షేమసంఘం అద్యక్షుడు ప్రముఖ హోమియోవైద్యులు డాక్టర్ వింతా కృష్ణారెడ్డి, ట్రెజరర్ బుర్లా శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పలువురు ఈ సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైభవంగా సంగమేశ్వరుని చప్పర ఉత్సవం



**సంగం జనవరి 13 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని శ్రీకామాక్షితాయి సంగమేశ్వరుని సన్నిది లో బోగి పండుగ పురస్కరించుకొని చొప్పర ఉత్సవం కన్నుల పండుగగా జరిగింది. భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో స్వామి వారిని దర్శించుకొని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.

## కోనలో వైభవంగా గోధా కళ్యాణోత్సవం

**పెంచలకోన(రాపూరు), జనవరి13ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో భోగి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకోని సోమవారం గోధా కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుండి 30 రోజుల పాటు గోధా అమ్మవారు పాడిన తిరుప్పావై నిర్వహించిన అర్చక స్వాములు ధనుర్మాసం ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకం,



పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గోధా అమ్మవారికి స్వామి వారితో కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సిబ్బంది ఆలయ సీనియర్ సహయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ, వినోద్, నరసింహా, వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వినోద్ స్వామి, సాయి స్వామి, నాగరాజు స్వామి తదితరులున్నారు.

## తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

**కావలి, జనవరి13 ప్రభాతవార్త** తెలుగువారి సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీక సంక్రాంతి అని, కావలి నియోజకవర్గ ప్రజలకు వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగభాగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు, సిరిసంపదలు ప్రసా దించి పాడి పంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటు న్నా నని తెలిపారు. కావలి నియోజకవర్గ ప్రజలకు, వైసిపి పార్టీనాయకు లకు, కార్యకర్తలకు, అభిమానులకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షల ను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



## బుచ్చి బైపాస్‌కి డిపిఆర్ తయారు చేయమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచనలు ఇవ్వడం హర్షనీయం

**బుచ్చి జనవరి 13 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంకి బైపాస్ అవసరాన్ని గుర్తించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి డిపిఆర్ తయారు చేయమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచనలు ఇవ్వడం హర్షనీయమని బిజెపి రూరల్ మండల అద్యక్షులు సిద్దం మనోహార్, సీనియర్ బిజెపినాయకులు ఇనుగూరు బాలయ్య





హర్షం వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం రోజురోజుకి అభివృద్ధి చెందుతుంది. దానికి తోడు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ సమయంలో బుచ్చిరెడ్డిపాళెంకి బైపాస్‌రోడ్డు వేస్తే కార్పోరేటు హాస్పటల్స్, కాలేజిలు, ఇండస్టీట్స్ వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగులుపాడు, చల్లాయపాళెం, సాల్మాన్‌పురం, జెండాదిబ్బ, పంచేడు, అరవపాళెం వంటి గ్రామాలన్ని బుచ్చి నగరపాలక పంచాయితీలో కలిసి పోయి రాబోయే రోజులలో బుచ్చిరెడ్డిపాళెం ఊహాలకందని అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. బైపాస్‌రోడ్డు విషయంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పందించడం హర్షనీయమని అన్నారు.

## సోమశిల నీటిమట్టం

**అనంతసాగరం, జనవరి13, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 2041 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 70.543 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 600, పెన్నా డెల్టాకు 2650, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.560 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.



## జిల్లా ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు - వేమిరెడ్డి దంపతులు

**నెల్లూరు రూరల్, జనవరి 13, ప్రభాతవార్త** ప్రజల మధ్య సత్సంబంధాలు పెంచి సుఖ సంతోషాలు పంచే మకర సంక్రాంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో వర్ధిల్లాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ఆకాంక్షించారు. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా వారు నెల్లూరు పార్లమెంట్, కోవూరు నియోజకవర్గ ప్రజానీకం, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్తరాయణం పుణ్య కాలమన్నారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఇంటింటా కొత్త కాంతులు వెల్లి విరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సూర్యుని కొత్త ప్రయాణం కొత్త మార్పుకు నాంది పలకాలని కోరారు. సంక్రాంతి కనుమ పండుగలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని మనసారా ఆకాంక్షించారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్టం సకల జన హితమే లక్ష్యంగా ప్రగతి పథం దిశగా పయనిస్తోందన్నారు. ప్రజలు సిరి సంపదలతో, భోగ భాగ్యాలతో తులతూగాలని కోరారు.



## ఈపూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు

**ముత్తుకూరు, జనవరి 13, ప్రభాతవార్త** ముత్తుకూరులో వెలసిన ఈపూరు చెన్న కేశవ స్వామి ఆలయంలో, శ్రీ కామాక్షి దేవి సమేత విరూపాక్షేశ్వరస్వామి శివాలయంలో దేవస్థానంలో మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుటుంబ సమేతంగా మండలంలోని మండలంలోని ఈపూరు చెన్న కేశవ స్వామి దేవస్థానం, ఈపూరు పంచాయతీలోని విరూపాక్ష దేవస్థానంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన తండ్రి గత 50 ఏళ్ళ క్రితం కండక్టర్‌గా ఉన్నప్పటి నుంచి స్వామి వారిని తమ కుటుంబం దర్శించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగా భోగి పండుగ సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. కాగా ఆలయం అర్చకులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేశారు. అదే విధంగా దేవస్థానం అభివృద్ధికి 25 లక్షలు రూపాయలు విరాళంగా అందిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. అలాగే దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ దృష్టికి ఈ ఆలయం గురించి వివరించి ఆలయాభి వృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మంత్రి నారాయణను అభినందించ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ



అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ముత్తుకూరు మండల తెలుగు యువత కార్యదర్శి శ్యాం రెడ్డి, శ్రీధర్, ఆలయ ధర్మకర్త దువ్వూరు విశ్వ మోహన్ రెడ్డి, టిడిపి నాయకులు, ఆలయ అర్చకులు, పూజారులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి

### బాల్ బాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు, జనవరి 13, ప్రభాతవార్త** కందుకూరు మండలం పలుకూరు గ్రామంలో నార్నే బాలయ్య మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆలిండియా సీనియర్ బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను సోమవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించి గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఓడిపోయిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని శరీర దృఢత్వాన్ని పెంపొందించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో గతంలో ఉన్న స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతం పెంచడం జరిగిందని తెలియజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పలుకూరు గ్రామంలో మంచి మెజార్టీతో ఆదరించిన గ్రామ ప్రజలకు ఎప్పటికి రుణ పడి ఉంటానని, గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే ఇంటూరి



నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వచ్చే 5 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్ తీర్చిదిద్దేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలియజేశారు. గ్రామీణ క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించి వారిని అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించగలమని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్ తెలియజేశారు. గతంలో తాను మొట్టమొదటి జడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు తర్వాత జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలుకూరు గ్రామం తనను ఎంతగానో ఆదరించిందని, ఈ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. కందుకూరు నియోజకవర్గంలో బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమన్నారు. రాబోయే రోజులలో ఇలాంటి టోర్నమెంట్‌లు మరిన్ని నిర్వహించి ఈ ప్రాంతానికి క్రీడా గుర్తింపు తీసుకురావాలని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్ నిర్వాహకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు బాల్ బాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బొద్దులూరి కొండలరావు, ఉన్నం భాస్కరరావు, పార్టీ నాయకులు యడవల్లి చంద్రయ్య, అన్ని గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సాగిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

### కనివిని ఎరుగని రీతిలో ఎడ్ల పోటీలు



**కోవూరు జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరురోడ్డు ప్రాంతంలో అరవింద రైసుమిల్లు సమీపంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. మొత్తం 40 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల ంచి అధిక సంఖ్యలో అభిమానులు ఈ ప్రాంతానికి చేరుకొన్నారు. యువత కేరింతలు, రైతు హుషారు మధ్య ఈ పోటీలు ఆద్యాంతం ప్రతి ఒక్కర్ని కనువిందు చేశాయి. మూడు కిలోమీటర్ల దూరాన్ని ఏ జట్టు అయితే తక్కువ సమయంలో వస్తుందో దీనికి ప్రథమ బహుమతి, వెండి కప్పు నగదు పారితోషకం ఉండటంతో దీనిని సాధించేందుకు ఎడ్ల జట్టు నిర్వాహకులు పోటీలు పడ్డారు. చెట్ల మీద, ఎక్కడ చూసిన అభిమానులే దర్శనమిచ్చారు. గత 35 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారు.. ప్రతి సంవత్సరం బోగి పండుగ సందర్భం గానే ఈ పోటీల్ని నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకొన్నారు. మొత్తం మీద ఈ ఎడ్ల పందేనికి అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరు కావడంతో నిర్వాహకుల్లో ఎక్కడ లేని ఆనందం వెల్లివిరిసింది. బహుమతులు సాధించేందుకు ఎడ్ల జట్లు నువ్వా నేనా అంటూ పోటీ పడడం విశేషం.



## అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం సహాయనిధి



**కందుకూరు, జనవరి 13, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న అభాగ్యుల జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజలకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అడిగిన వెంటనే ఆపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారని, ఆర్థిక స్థోమత లేని అనేక మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం 14 మందికి కలిపి రూ.13,68,719లను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు వంకాయలపాటి మాల్యాద్రి, బోయిళ్లకొండపనాయుడు, గొంది నర్సింగరావు, పొడపాటి మహేష్, మాదాల రవికుమార్, సోమినేని కొండలరావు, రావుల రవి, నూతలపాటి బుల్లియ్య, పతంగి బాలకృష్ణ, అవనిగడ్డ నాంచార్లు, యనమల రామారావు, మోదేపల్లి నారాయణ, ముచ్చు వేణు, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రూ. లక్ష విలువ చేసే విదేశీ మద్యం స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, జనవరి 13, ప్రభాతవార్త :** ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం నగరంలో దాడులు నిర్వహించి రూ. లక్ష విలువచేసే 25 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ జగదీశ్వర్ రెడ్డి తన సిబ్బం దితో కలిసి స్థానిక మధ్వపతి వారి అగ్రహారం వీధిలో ఉన్న మును స్వామి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో విదేశీ మద్యం బాటిళ్ల నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ దాడు ల్లో ఖరీదైన విదేశీ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డ్యూటీ చెల్లించని మద్యం బాటిళ్లను నాగరాజు చెన్నై తదితర ప్రాంతాల నుండి తీసుకొచ్చి నెల్లూరులో విక్రయాలు జరుపుతుంటాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నిందితుడి పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## పార్టీ మరింత బలోపేతానికి కృషి చేసా: ప్రతాప్‌రెడ్డి

**ఆత్మకూరు, జనవరి13, ప్రభాతవార్త:**



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో వైసిపి మరింత బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా పార్టీ పట్టణ అధ్యక్షునిగా నియమితులైన నాగులపాటి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మేకపాటి క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సి. హెచ్. ఆదిశేషయ్య, సీనియర్ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డిలు నాగులపాటి ప్రతాప్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పలు మండలాలకు నూతన కన్వీనర్లను నియమించారు. వారందరికీ శుభాభినందనలు తెలుపుతున్నా మన్నారు. అందరం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నాగులపాటి ప్రతాప్‌రెడ్డిని మున్సిపల్ పరిధిలో ని 23వార్డులకు చెందిన వైసిపి నాయకులతోపాటు ఆత్మకూరు రూరల్ మండల ఆయకులు, జడ్పీటిసి సభ్యులు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వల్లభనేని రాజేంద్ర లు పాల్గొని అభినందనలు తెలిపారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతి వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాన్నారు. తనను నమ్మి ఆత్మకూరు పట్టణ అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర వైసిపి అధ్యక్షుడు వైఎస్‌జగన్మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు

## ఘనంగా భోగి వేడుకలు



**వింజమూరు, జనవరి13, ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో వాడవాడలా భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజామునే యువత మేల్కొని భోగి మంటలకు ఏర్పాటు చేసుకున్న కంప , తాటాకులను చేర్చి భోగి మంటలను వేశారు. యువత కేరింతలు , ఆనందో త్సాహాలతో ఒకరికొకరు పోటీ పడి ఈమంటలను వేశారు. మహిళలు ఇంటి ముంగిట రంగురంగుల రంగ వల్లులను తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. ముందుగానే తయారు చేసిన పిండివంటలు , అత్తవారి ఇళ్ళకు కొత్త అల్లుళ్ళు రాకతో కళకళలాడాయి.

## ఘనంగా వీరాంజనేయస్వామి ఉత్సవాలు



ఉభయకర్తలుగా పునుగుంట శేషరెడ్డి దంపతులు

**కోవూరు జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులో వెలసియున్న శ్రీ వీరాంజేయస్వామి దేవసానంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నాగరాజా చార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలునిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. వ్యవహరించారు.

## వైభవంగా శివ ముక్కోటి ఘనంగా ద్వార దర్శనం



**కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షితాయి మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం శివముక్కోటి ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకు లు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో మహన్యాసపూరక రుద్రాభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్వామివారు ద్వార దర్శనంలో భక్తులకు దర్శ నమి చ్చారు. అనంతరం గ్రామోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆస్ట్రేలియాలో నివశిస్తున్న సాయం కృష్ణచై తన్య, శ్రావణి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కృష్ణప్రసాద్, భక్తులు ఉన్నారు.

## వైభవంగా ఉత్సవాలు ప్రారంభం



**కోవూరు జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన రహదారిలో వెలసి ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో పుష్యమాస పౌర్ణమి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్స వాలు సోమవారం ఘనంగా ప్రారంభ వయా య్యి. ఈ సందర్భాన్ని పుం స్కరిం చుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అ త్యంత వైభ వంగా అలంకరించారు. ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## ఘనంగా భోగి వేడుకలు



**కందుకూరు, జనవరి 13, ప్రభాతవార్త :** కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా భోగి పండుగను నిర్వహించారు. ఉదయం 5గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్ద భోగి మంటలు వేసి నియోజకవర్గ ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంక్రాంతి ముగ్గుల పోటీలు



**నెల్లూరు, జనవరి 13, ప్రభాత వార్త-వైద్యం :** సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక, వర పరివార్ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 26 డివిజన్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ ముత్యాలమ్మ గుడి ప్రధా న రహదారిపై జరిపిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన వ్యక్తమైంది. స్థానిక పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పలు రకాల ఆశలతో రంగు రంగుల ముగ్గులను పోటా పోటీగా తీర్చిదిద్దారు. విజేతలకు వేలాది రూపాయల విలువైన గృహోపకరణాలను ముఖ్య అతిధుల చేతుల మీదుగా బహుకరించారు. ప్రముఖ గాయనీమణి వేదం హర్షవర్ధని, సంఘ సేవకురాలు పెనాకే సుజాతరెడ్డిలు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సృజన అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ, వరపరివార్ సేవా ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ ఎస్. మాధవిలు మాట్లాడుతూ తరతరాల మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. సంక్రాంతి వేడుకల్లో ఒక భాగమైన రంగువల్లుల చిత్రీకరణను అందరూ ఆనందించేందుకే ఈ పోటీలను జరిపామని తెలిపారు. తేజు ఇంజనీరింగ్ సర్వీసెస్ అధినేత నారాయణకొశర్మ, మన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ మారం సుధాకర్, హర్య ఆర్కిటెక్ట్స్ మేనేజర్ కౌషల్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బూడిద పురుషొత్తం యాదవ్, వ్యాపారవేత్త మల్లవరం గీతాకృష్ణ తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. విజేతలుగా ప్రథమ బహుమతి 2 వేల రూపాయలు గిఫ్ట్ వన్మయి, ద్వితీయ బహుమతి రూ.1000లు గిఫ్ట్ అవేణి, 4వ,5వ బహుమతులు రూ.1000 గిఫ్ట్స్ దివ్య, పావని పోటీదారులందరూ కానుకలు అందుకున్నారు.

## సంక్రాంతి హిందువుల పవిత్రపండుగ : భారతి



**వలేటివారిపాలెం జనవరి 12, ప్రభాతవార్త :** మకర సంక్రాంతి హిందువులకు పవిత్రమైన ప్రత్యేకమైన పండుగ అని వలేటివారిపాలెం జెడ్పీటీసీ సభ్యుల ఇంటూరి భారతిహరిబాబు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా హైందవ సంస్కృతిని పరచిన తెలిపే పండుగనే సంక్రాంతి అన్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో తెలుగుప్రజలు నిర్వహించే మూడు రోజుల పండను ప్రజలు సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మండల ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలుతెలిపారు.

## భక్తులతో కిటకిటలాడిన కావలి శివాలయం

### విశేష పూజలు చేసిన భక్తజనం



**కావలి, జనవరి13 ప్రభాతవార్త :** సోమవారం భోగిపండుగ, పౌర్ణమి, ఆరుద్రనక్షత్రం అన్ని ఒకేసారి రావడంతో విశేష పర్వదినంగా భక్తులు కావలి పట్టణంలో వేంచేసిఉన్న శ్రీ దుర్గా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి (కావలిశివాలయం) ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వపి ంచా రు. కావలి శివాలయంలో శివలింగానికి అన్నాభిషేకం చేయడంతో భ క్తులు దర్శించుకుని తరించారు. శివముక్కోటిగా పిలువబడుతున్న ఈ పర్వదినానికి భక్తులుపెద్దసంఖ్యలో శివాలయానికి తరలి వచ్చి అన్నా భిషే కాన్ని కన్నులవిందుగా తిలకించారు. శివనామస్మరణహోరులో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. కావలి శివాలయం అనువంశిక అర్చకులు ఎఆర్ శశిధర్ గురుకుల్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూల అలంకారలతో శివపార్వతుల ఉత్సవం ఘనంగా జరిగింది. భక్తులకు అన్నాభిషేకం ప్రసాదం అందచేశారు.

## కమనీయంగాసాగిన గోదాదేవి కళ్యాణం



**కావలి, జనవరి13 ప్రభాతవార్త :** కావలి పట్ట ణంలో వేంచేసిఉన్న శ్రీభూసమేత శ్రీలక్ష్మి కాంత స్వామి (విష్ణాలయం) ఆలయంలో సోమవారం ఎంతో కమనీయంగా గోదాదేవి కళ్యాణం జరిగి ంది. వేదపండితుల మంత్రో చ్ఛారణలమధ్య గోదాదేవి కళ్యాణం అంగరంగ వైభవంగా సాగింది. కావలి విష్ణాలయం వంశ పారంపర్య అర్చకులు నారాయణం రామా చార్యులు ఆధ్వర్యంలో గోదా దేవి కళ్యాణం ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ఊరేగింపు జరిగింది. ఈ కళ్యాణంలో పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. వ్యవస్థాపక ధర్మకర్త కసవ రాజు వెంక టమల్లికార్జున కృష్ణమోహన్ దంపతులు, రోహిణిఆక్వా అధినేత వేలూరు జయచంద్రనాయుడు, ప్రముఖ రియల్టర్ జనిగర్ల మహేంద్రయాదవ్, ప్రముఖ బిల్డర్ కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, ప్రముఖ ఆడిటర్ ముక్కాల వేణుగోపాల్, వేలూరు జనార్ధన్ నాయుడు, అనుమాలశెట్టి బదరి, విస్సా రాంప్రసాద్, చిన్ని నాగేశ్వర రావు, మధు, పలువురు భక్తులు, మహిళలు ఎక్కువగా పాల్గొని కన్నులవిందుగా గోదాదేవి కళ్యాణాన్ని తిలకించారు.

## ఆదరణ కేంద్రంకి కాంద్ర సతీష్ నాయుడు నిత్యావసర వస్తువుల వితరణ



**బిట్రగుంట జనవరి 13 ప్రభాతవార్త:** కాంద్ర యవనేస్తం వ్యవస్థాపకులు కాంద్ర సతీష్ నాయుడు ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటి ఆదరణ కేంద్రం కి, రూ.20 వేల రూపాయల విలువ చేసే నిత్యావసర వస్తువులు వితరణ గా సోమవారం అందచేశారు., గత మూడు సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా అందజేస్తున్నారు, ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, ప్రతి నెలా 1 వ తేదీ మేము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు, సతీష్ నాయుడు దేవుడి లాగా వచ్చి ఆదరణ కేంద్రంలో మంచినీటికోసం బోర్ వెల్ కూడ వేయించి అనాథలకు మంచినీటి సదుపాయం కల్పించి ఆదుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్య క్రమంలో ఆదరణ కేంద్రం డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు, భవాని తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా భోగి పండుగ



**బిట్రగుంట జనవరి 13 ప్రభాతవార్త:** బోగోల మండలంలో సోమవారం వేకువ జామున భోగి పండుగను ప్రజల సాంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నారు భోగి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ ఆధ్వర్యంలో గట్టినిఘా ఏర్పాటు చేశారు.

## బెస్ట్ జాకీగా గోపిరెడ్డి



**కోవూరు జనవరి 14 ప్రభాతవార్త :** సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోవూరుకు చెందిన రైతు సమన్వయ కమిటీ గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల ప్రదర్శన ప్రశాం తంగా నిర్వాహకులు నిర్వహించడం అభినందనీయ మని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నలుమూలల నుంచి ఈ ప్రదర్శన తిలకించేందుకు ఊహించని స్థాయిలో ప్రేక్షకులు హాజరయ్యారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాము కూడా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలో పాల్గొనే ఎడ్ల జట్లు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. గెలుపొందిన ఎడ్ల జట్టును ఆయన ప్రత్యేకంగా అభిన ందించారు. బెస్ట్ జాకీగా ఎంపికైన గోపిరెడ్డిని సీఐ వెండికప్పుతో శాలువా కప్పి ప్రత్యేకంగా అభినం దించారు. రైతు సమన్వయ కమిటీ సంఘం సభ్యులు మల్లిఖార్జునరెడ్డి, నరేంద్రరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి , సుబ్బయ్య, శ్రావణ్‌రెడ్డి, ఎం. సుధాకర్, వై. మదన్‌రెడ్డి, సాయిరెడ్డి, కొడవలూరు సీఐ సురేంద్రబాబు ఎస్సైలు రంగనాథ్ గౌడ్, అంజిరెడ తదితరులు ఉన్నారు.

## సిద్దవరంలో నేడు కొండవీటి జ్యోతిర్మయి ప్రవచనాలు



**సిద్దవరం(రాపూరు), జనవరి13పభాతవార్త :** మండలంలోని సిద్దవరం గ్రామంలో మంగళవారం సంక్రాంతి సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనవేత్త కొండవీటి జ్యోతిర్మయి ప్రవచనాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలోని శ్రీరామ మందిరం ప్రాంగణంలో ఆమె భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపిస్తారని వారు తెలిపారు. మండలంలోని హిందూ భక్తులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

## విద్యుత్ దేదీప్యమాన కట్‌ఔట్లతో అలరారుతున్న సినిమాహాల్‌రోడ్డు





**కావలి, జనవరి13 ప్రభాతవార్త :** కావలి గ్రామ దేవత శ్రీ కళుగోళ శాంభవిమాత సంక్రాంతి సంబరాల్లో భాగంగా కావలి పట్టణ సినిమాహాల్ రోడ్డులో స్నేహయూత్, ఫ్రెండ్లీయూత్‌ల ఆధ్వర్యంలో మూడురోజులపాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యుత్‌దేదీప్యమాన దేవుళ్ల కట్‌ఔట్లతో పోటీలుపడుతూ ఏర్పాటు చేశారు. సంక్రాంతి వచ్చిందంటే కావలి సినిమా హాల్‌రోడ్డు విద్యుత్ దేదీప్యమాన అలంకారాలతో అలరారుతుంది. వడ్డిపాలేనికి చెందిన స్నేహయూత్, ఫ్రెండ్లీయూత్ సంస్థలు పోటీలుప డుతూ పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కావలి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. అందులో భాగంగా ఈ సంక్రాంతికి కూడా భారీస్థాయిలో దేవుళ్ల విద్యుత్ కటౌట్లతో పోటీలుపడుతూ సినిమాహాల్ రోడ్డును నింపేశారు. స్థానిక పొట్టిశ్రీరాములు సెంటర్‌నుంచి గ్రామదేవత కళుగోళశాంభవి ఆలయం వరకు విద్యుత్ దేవుళ్ల కటౌట్లు కావలిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోనే ఈ విద్యుత్‌దేవుళ్ల కటౌట్లు కావలిలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

## పేదలకు నూతన వస్త్రాల బహుకరణ



**కందుకూరు, జనవరి 13, ప్రభాతవార్త :** మానవసేవే మాధవసేవ అంటూ నిరంతరం పేదవారి అవసరాలను తీర్చే దిశగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, బొగ్గవరపు వెంకటేశ్వర్లు సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉంటే నిరాశ్ర యులకు సంక్రాంతి పర్వదినం సందర్భంగా ముందుగానే వాళ్లకి నూతన వస్త్రాలను బహుకరించడం జరిగింది. వేణుగోపాలస్వామి వారి దేవస్థానం జాయింట్ సెక్రటరీ నల్లమల్లి ప్రసాదరావు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా మన తో పాటు పేదవారు కూడా నూతన వస్త్రాలు ధరించి సంక్రాంతి పండుగ చేసుకోవాలనే మంచి సంకల్పంతో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వారు నూతన వస్త్రాలను అందజేయడం ఓ గొప్ప కార్యక్రమమని అన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవాహృదయ డాక్టర్ రవ్వా శ్రీనివాసులు(ఎల్ఐసీ ఏజెంట్), సభ్యులు చిన్ని వెంకట సాయి పవన్ కుమార్, చిన్ని వెంకట నాగసాయి పూర్ణ తేజ, చీదెళ్ల కృష్ణ(మణికంఠ గార్మెంట్స్), అశ్విని ప్రియ, బ్రహ్మయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

## కావలి నియోజకవర్గ వైసిపి మండల అధ్యక్షులు వీరే



**కావలి, జనవరి13 ప్రభాతవార్త :** వైసిపిపార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు కావలి నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులను ప్రకటించారు. వైసిపి కావలి పట్టణ అధ్యక్షుడుగా కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి వరుసగా మూడుసార్లు ఎంపికై హ్యాట్రిక్ అధ్యక్షుడుగా పేరుతెచ్చుకున్నారు. కావలిరూరల్ మండలం అధ్యక్షుడుగా వాయిల తిరుపతి, బోగోలు మండలం అధ్యక్షుడుగా మద్దిబోయిన వీరరఘుయాదవ్, దగదర్తి మండలం అధ్యక్షుడుగా తాళ్లూరు ప్రసాదనాయుడు, అల్లూరు నగరపంచాయితీ అధ్యక్షుడుగా దండ కృష్ణారెడ్డి, అల్లూరు మండలం అధ్యక్షుడుగా బీద రమేష్ బాబులను నియమించారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

## ఆత్మీయ సమ్మేళనం కలిసిన పూర్వ విద్యార్థులు





**లింగసముద్రం, జనవరి 13, ప్రభాతవార్త :** పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు అన్నారు. మండల కేంద్రమైన లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-2002 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటశాలలో చదుకొని వెళ్లినవారు అప్పుడు జరిగిన సంఘటనలను నెమరు వేసుకుంటూ జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి ఆత్మీయ సమ్మేళనం ఎంతో దోహదపడుతుందని అన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 1,70,000 తో సైకిల్ స్టాండ్‌ను నిర్మించడం అభినందనీయమని, పాఠవాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావడం శుభసూచికం అని అన్నారు. ఇక్కడ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయిలో వివిధ ఉద్యోగాలు చేస్తూ నేడు తిరిగి పాఠశాలకు వచ్చి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాధవరావును, ఉపాధ్యాయులు కొండయ్యను పూర్వ విద్యార్థులను సత్కరించారు. అనంతరం ఆరు నుంచి పదో తరగతి వరకు అప్పట్లో ఉన్న రూములలో విద్యార్థులుగా కూర్చొని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మేము చదువుకున్న పాఠశాలలో సైకిల్ స్టాండ్ నిర్మాణం చేసుకునే విధంగా మాకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు అన్నారు.

## ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు



**సీతారామపురం జనవరి 13 ప్రభాతవార్త :** తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిక అయిన సంక్రాంతి పండుగను మండలంలోని ప్రజలందరు సంతోషాలతో జరుపుకోవాలని జడ్‌పిటిసి రమణారెడ్డి పేర్కున్నారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ,సుఖ సంతోషాలతో పాడి పంటలు సిరి సంపదలతో తులతూగాలని ఆయన కాంక్షించారు. మకరసంక్రాంతి కనుమ పరవదినాలను మరింత ఆనందోత్సహాలతో జరుపుకోవాలని అన్నారు.

## కండలేరులో 56.216 టీయంసీల నిటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), జనవరి13ప్రభాతవార్త:** మండలంలోని కండలేరు జళాశయంలో సోమవారం ఉదయానికి 56.216 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 180 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జళాశయంలోకి వస్తుండగా అవుట్‌ఫ్లోగా జళాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 975 క్యూసెక్కులు,1వ బ్రాంచి కెనాల్ ద్వారా 70 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 110 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి హానికరం



**కావలిరూరల్, జనవరి13 ప్రభాతవార్త :** సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం మానవాళికి ప్రమాదమని లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి తెలియచేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల వినియోగనిషేధచట్టంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యంగా ఎదగాలని కోరారు. సమాజంలో యువత నల్లమందు, గంజాయి, బ్రౌన్‌షుగర్‌వంటి మత్తు పదార్థాలను స్వీకరించడంవలన యువత నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. స్వామి వివేకానందుని బోధనల ప్రకారం ఉక్కునరాలు, ఇనుప కండరాలు కలిగిన ఆరోగ్యవంతమైన యువత ఈ సమాజానికి అవసరమని తెలియచేశారు. మత్తుపదార్థాలు సేవించడం వలన జరిగే దుష్ఫలితాలపై యువతకు అవగాహన పెంచాలని పౌరసమాజాన్ని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

## పేదలకు సంక్రాంతి కానుక పంపిణీ



**మర్రిపాడు, జనవరి13, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం చిలకపాడు పంచాయతీలో సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి, సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి దంపతులు సంక్రాంతిని పురస్కరించుకొని సోమవారం నిరుపేదలకు సంక్రాంతి కానుకను అందజేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈసంవత్సరం కూడా నిరుపేదలకు సంక్రాంతి కానుక ఇవ్వడం పట్ల నిరుపేదలు ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీకి చెందిన 58 మంది నిరుపేదలకు రెండు సెంట్లు భూమి పట్టాలను వారి సొంత నిధులతో అందజేశారు. దీంతో వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు , బొర్రా సుబ్బారెడ్డి, మండల సీనియర్ నాయకులు సి. హెచ్. నారాయణస్వామి, బొర్రా వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విక్రమ్‌రెడ్డి జన్మదినవేడుకలు



**మర్రిపాడు, జనవరి13, ప్రభాతవార్త:** మర్రిపాడు వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి 52వ జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి విక్రమ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన వైసిపి కన్వీనర్ గా నియామకమైన చెన్ను వెంకటేశ్వరరెడ్డిని జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీ చిట్టెం శ్రీనివాసులును పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలను కలుపుకొని మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని నూతన కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీ చిట్టెం శ్రీనివాసులు, సిద్ధం మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్రా సుబ్బారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు జి.రవీంద్రబాబు, జి.కాంతారెడ్డి, సి. హెచ్. నారాయణస్వామి, పి.ప్రతాప్‌రెడ్డి, ఎం.హజరత్‌రెడ్డి , వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

## ఇందుకూరుపేట వైసీపీ మండల అధ్యక్షుడిగా మావులూరి శ్రీనివాసులురెడ్డి



**ఇందుకూరుపేట, జనవరి 13, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాపై ఇచ్చిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నూతనంగా వైఎస్సార్‌సీపీ ఇందుకూరుపేట మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మావులూరి శ్రీనివాసు లురెడ్డి అన్నారు. శ్రీనివాసు లురెడ్డి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఇందుకూ రుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించి శ్రీనివాసులురెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకముంచి మూడో సారి మండల అధ్యక్షుడుగా నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఏకతాటిపై ఉండి నాయకులంతా కలిసి మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తానని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మీ, ఏపీ డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, బట్టేపాటి నరేందర్‌రెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, పంబాల జనార్ధన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నాయుడు సురేష్, మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్ర నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు కావలి రవి, ఎస్‌కే షబ్బీర్, గొడ్డటి చంటి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నుల పండుగా గోదాదేవి కళ్యాణం



**కోవూరు జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులో వెలసియున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో పుష్యమాస శుద్ధ పౌర్ణమి సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీ గోదాదేవి కళ్యాణ కార్యక్రమాన్ని రుత్వికులు శ్రీకాంత్ స్వామి, నాగారాజ స్వామి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రుత్వికులు గోదాదేవి కళ్యాణ విశిష్టను నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమాన్ని కనులారాగాంచినా.. చెవులారా విన్నా ఇహలోక్త ముక్తి ప్రాప్తి కలుగుతుందని రుత్వికులు వివరించారు. మాజీ సీడీసీ చైర్మన్ జక్కం రెడ్డి కృష్ణారెడ్డి, , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా శ్రీ మాడిశెట్టి వెంకట్రావు, జయంతి కుటుంబ సభ్యులు వ్యవ హరించారు. పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు.







## అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు



**మర్రిపాడు, జనవరి13, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం డిసిపల్లిలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమ వారం శ్రీపంచముఖ శక్తి గణపతి దేవస్థానం వద్ద శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచిపరమేశ్వరరెడ్డి సొంత నిధులతో నిర్మించిన యాగశాలను ప్రారంభించారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈకార్యక్రమంలో అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపల్లి మధుసూధన శర్మ, డిసిపల్లి కోదండ రా మాలయం అర్చకులు చింతలపల్లి వెంకటేశ్వరశర్మ, మర్రిపాడు సమీపంలోని అచ్చమాంబ దేవాలయం, శ్రీ పంచముఖ శక్తి గణపతి దేవస్థానం ఆలయ అర్చకులు పాశర్లపూడి వెంకటేశ్వర శర్మ ఆధ ్వర్యంలో మహిళలకు నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు, విద్యార్థులకు మహాభారతం క్విజ్, చిన్నారులకు కుర్చీలాట తదితర కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఆయా పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. శ్రీ పంచముఖ శక్తి గణపతి దేవస్థానం ఆలయ ప్రాంగణం సమీపంలో ఉన్న విశాలమైన స్థలంలో సంక్రాంతి సందర్భంగా చింతల పల్లి మధుసూధన శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను బ్యాటింగ్ చేసి టాస్ వేసి ప్రారంభించారు. ఈకార్యక్రమ నిర్వహణలో రేవూరు రమణారెడ్డి-సుధమ్మ దంపతులు, జంపన భాగ్యలక్ష్మి, వెలుతుర్ల వీరయ్య, రేవూరు భరత్ వంశీరెడ్డి, జయంత్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటశివారెడ్డి వారి మిత్రబృందం తమ వంతు సేవలు అందించారు. ఈకార ్యక్రమంలో డిసిపల్లి గ్రామ ముఖ్య నాయకులు చిలకా మస్తాన్‌రెడ్డి, గ్రామంలోని మహిళలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు భోగి శుభాకాంక్షలు : ఎమ్మెల్యే



**వింజమూరు, జనవరి13, ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గ పల్లెల్లో ప్రతి ఇం ట భోగిమంటల వెలుగులు భోగభా గ్యా లను నింపాలని ఇంటిల్లిపాది ఎంతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఉదయగిరి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకుల కు, కార్యకర్తలకుప్రభుత్వ అధికా రులకు, మీడియా మిత్రులకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ వింజమూరులోని టిడిపి ప్రధాన కా ర్యాలయ ప్రాంగణంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ భోగిమంటలు వేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో బిఎంఆర్



**అల్లూరు, జనవరి 13, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు తన స్వగ్రామమైన అల్లూరు మండల పరిధిలోని ఇసుకపల్లి గ్రామంలో సోమవారం సంక్రాంతి సంబరాల్లో పాల్గొ న్నారు స్వగ్రామానికి విచ్చేసిన బిఎంఆర్ ను అభిమానులు రాజకీయ నాయకులు ఆత్మీయులు మర్యాద పూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి ఏటా సంక్రాంతి పండుగను స్వగ్రామంలో జరుపుకోవడం బిఎంఆర్ కు ఆనవాయితీగా వస్తుంది ఈ సంవత్సరం సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సభ్యులతో కలసి ఆయన ఇంటి వద్ద నుండి మంగళ వాయిద్యాలు గంగిరెద్దులు హరిదాసులతో ఊరేగింపుగా బయలుదేరి స్థానిక శివాలయం గంగమ్మ గుడిలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం మహి ళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలించినారు పలువురు రాజకీయ నాయకులు అభిమానులు ఆత్మీ యులు బీద మస్తాన్ రావుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో సన్మానించగా అందరినీ ఆప్యాయంగా పలకరించారు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రీన్ గార్డెన్స్ ను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో బీద గిరిధర్ దేవరాల సుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బిఎంఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**అనంతసాగరం, జనవరి13, ప్రభాత వార్త:** క్రీడలతో మానసిక ఉల్లాసమని జిల్లా తెలు గుదేశం పార్టీ సీనియర్ నా యకుడు గిరి నాయుడు పేర్కొన్నారు. మండలంలోని సోమశిల గ్రామంలోని హిల్‌కాలనీలో మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం మాజీ ఎంపిటిసి సభ్యులు, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు యోగు పెంచల య్య ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈకార్య క్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నాయ కులు గిరినాయుడు పాల్గొన్నారు. తొలుత గిరి నాయుడు అంకాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 లో క్రీడామైదానంలో మాజీ శాసనసభ్యులు బొల్లినేని క ృష్ణయ్య సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహించా మని మరలా 2025లో బొల్లినేని సహ కారంతో ఈ టోర్నమెంట్‌ను నిర ్వహించా మన్నారు. యువత ఈ రోజుల్లో ఎక్కు వగా సెల్‌ఫోన్‌లపైనే టైమ్‌ను కేటాయి స్తు న్నారని, ఆటలపై శ్రద్ధవహించాలన్నారు. ఈటోర్న మెంట్‌కు కృషి చేసిన మాజీ ఎంపిటిసి సభ్యులు యోగు పెంచల య్యను అభినందించారు. మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత, గౌరవరం సర్పంచ్ శాఖమూరి సుబ్బారావు, సోమశిల మాజీ సర్పంచ్ ఉప్పల విజయ్‌కుమార్, ఆర్గనైజర్‌స పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వస్త్రాలు పంపిణీ చేసి గుబ్బా సురేష్ దంపతులు



**బుచ్చి జనవరి 13 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని వాసవీనగర్‌లో ఆర్య వైశ్య నాయకులు, టిడిపినేత గుబ్బా సురేష్ ఆయన సతీమణి గుబ్బా సుకృత లక్ష్మీతో కలిసి పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సుమారు 350 మందికి ఈ వస్త్రాలు పంపీణి చేసినట్లు ఆయన తెలిపారు. ఏటా బోగి రోజు, సంక్రాంతిరోజు రెండు రోజులు పేదలకు దుస్తులు పంపీణి చేసే కార్యాక్రమాన్ని ఏటా సురేష్ దంపతులు నిర్వహిస్తున్నారు. ఇలా పేద ప్రజలకు పండుగరోజు వస్త్రాలు పంపిణీ చేయడం వల్ల వారు కూడా కొత్త బట్టలు వేసుకొని ఆనందం వ్యక్తం చేస్తారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## బోగిమంటలు వేసిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి జనవరి 13 ప్రభాతవార్త** బోగి పండుగ పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ మున్సిఫల్ కార్మికులతో కలిసి బోగి మంటలు వేశారు. ప్రజలకు బోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి నుండి పంటలు బాగా పండాలని, అందరి జీవి తాలలో మంచి వెలుగులు రావాలని ఆమె కాంక్షించారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. శానిటేషన్ కార్మికులతో కలిసి బోగి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఎడ్ల విజేత ఎస్ఎస్ బ్రదర్స్ ఎడ్ల జట్టు







**కోవూరు జనవరి 14 ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరు రోడ్డు అరవింద రైసుమిల్లు ప్రాంతంలో సోమవారం భోగి పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎడ్ల పోటీల్లో నెల్లూరు జిల్లా అల్లూరుకు చెందిన ఎస్ఎస్ బ్రదర్స్ ఎడ్ల జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకొంది. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, కొడవలూరు సీఐసురేంద్రబాబు, ఎస్సైలు రంగనాథ్ గౌడ్, అంజిరెడ్డిలు, నిర్వాహకులు రైతు సమన్వయ కమిటీసంఘంసభ్యులు మల్లిఖార్జునరెడ్డి, నరేంద్రరెడ్డి, ఇంతామల్లారెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి , సుబ్బయ్య, శ్రావణరెడ్డి, ఎం. సుధాకర్, వై. మదన్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

**విజేతలు వీరే...**నెల్లూరు జిల్లా అల్లూరు మండలానికి చెందిన ఎస్ఎస్ బ్రదర్స్ ఎడ్ల జట్టు మొదటి బహుమతిని కైవసం చేసుకొంది. ఈ బహుమతిని అనపల్లి అశోక్‌రెడ్డి ధర్మపత్ని అనపల్లి సులోచనమ్మ జ్ఞాపకార్థం వారిచే రూ40,000, వెండి కప్పును అందచేశారు. అదే విధంగా రెండో బహుమతి సాధించిన వరసిద్ధి వినాయక పొట్టేపాలెం ఎడ్ల జట్లుకు దండి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం వారి సతీమణి సుబ్బమ్మ, కుమారులు రూ. 25,000లు అందచేశారు. దివంగత పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం వారి కుమారుడు మారుతి నాగార్జున, కుటుంబ సభ్యులు నిఖిల్‌లు వెండి కప్పును అందజేశారు. తృతీయ బహుమతి సాధించిన చాముండేశ్వరి సీ ఫుడ్స్ గంగపట్నం ఎడ్ల జట్టు సాధించారు. ఈ జట్టుకు రూ. 20,000లను దివంగత గాదిరాజు ప్రభాకర్‌రావు, కుమారుడు సురేష్‌బాబు జ్ఞాపకార్థం వారి తమ్ముడు గాదిరాజు భాస్కర్‌రావు తనయుడు జీవన్‌కృష్ణ అందచేయగా, వెండి కప్పును దివంగత పొబ్బారెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు మల్లిఖార్జునరెడ్డి, నరేంద్రరెడ్డిలు అందచేశారు. నాల్గవ బహుమతి పాటూరు గ్రామానికి చెందిన పోలేరమ్మ తల్లి ఎడ్ల జట్టుకు రూ. 15,000లను ఇంతా కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు ఇంతా శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డిలు అందచేయగా.. వెండి కప్పును దివంగత సాయం వరదయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు కృష్ణ చైతన్య తరపున మారుతీ నాగార్జున, నిఖిల్ అందజేశారు. ఐదవ బహుమతిని రంగనాయకులపేటకు చెందిన రంగనాథస్వామి ఎడ్ల జట్టు కైవసం చేసుకుంది. రూ. 10,000లను దివంగత గడ్డం చిన్న వెంగల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు వేణుచే పంపిణీ చేశారు. వెండి కప్పును దివంగత కైలాసం పద్మావతమ్మ జ్ఞాపకార్థం భర్త గోపాల్‌రెడ్డి అందజేశారు.

## ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా రెండో సారి నియామకం

- ఘన సన్మాన కార్యక్రమం

- హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



**ఉదయగిరి, జనవరి 13, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం సోమవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మన ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాజగోపాల్‌రెడ్డి మరియు చేజర్ల సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు రెండోసారి సీఎం ఓబుల్‌రెడ్డికి ఉదయగిరి వైసీపీ పార్టీ మండల కన్వీనర్‌గా నియమించడం సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం చేశాఉ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, అభిమానులు ఈ పదవి కట్టబెట్టినందుకు నా శాయ శక్తుల నేను పార్టీకి కష్టపడి పని చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, ఎంపి రియాజ్, షావుకార్ ఎంఎ సలీం, మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరు హరి నల్లిపోగు ప్రసాద్, టింకర్ బాబు, వెంకటేష్, యు. గురవయ్య పాల్గొన్నారు.

## బోగి సంబరాల్లో ఎమ్మెల్యే కాకర్ల



**జలదంకి, జనవరి13, ప్రభాతవార్త:** ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ మండల కేంద్రమైన జలంకిలో సోమవారం బోగి సంబ రాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదా నంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజే తలకు బహుమతులు అందజేశారు. అనంతరం కావలి డివిజన్ స్థాయిలో కబాడీ పోటీలను ఎంఎల్ఎ ప్రారంబించారు. క్రీడాకారులను పరిచయంచేసుకొని బెస్‌ఆ వ్‌లక్ తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి సంబరాలు ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సాహ భరితంగ సాగుతాయన్నారు. ప్రతి పల్లెలో గ్రామీణక్రీడలు చేపట్టడం పండుగసందర్భంగ సొంతవూళ్ళకు విచ్చే సిన విద్యార్తులు, యువత, ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొని ఎంజాయ్‌చేయడం మధు రానుబూతని అన్నారు. రంగవల్లులపోటీలలో మహిళలు, బాలికలు పాల్గొని తమ ప్రతిభాపాటవాలు చాటడం ఎంతైనా సంతోషించదగ్గ పరిణామమన్నారు. ప్రస్తుతం మహిళలు అన్నిరంగాలలో అత్యుత్తమంగ రాణిస్తు ఆయా రంగాలకువన్నేతెస్తు పుషులకు ఏ మాత్రం తీసపోనివిదంగ ప్రతిభ చాటుతున్నారన్నారు. తమ ప్రభుత్వం ఆడపడుచులకు అండగ వుంటుందని తెలియజే శారు. ఉదయగిరి నియోజకవర్గంలో యువత గంజాయిమ హమ్మారికి దూరంగ వుండాలని పిలుపునిచ్చారు. అందరం నడుంబి గించి గంజాయి నిర్మూలనే ధ్యేయంగ పాటుపడదామ న్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి గోచిపాతల వెంకటర మణయ్య , టిడిపి మండలాధ్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడి , పూనూరు భాస్కర్‌రెడ్డి, జలదంకి ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, వడ్డే శ్రీనాద్‌రెడ్డి, గంటా అశోక్, నిమ్మలపల్లి రామచైతన్య, నిమ్మకాయల మురళి, పులిగుంట మహేంద్రారెడ్డి, శ్రీసాయి విద్యాసంస్థల అధినేత అయ్యల్‌రెడ్డి, కలిగిరి సిఐవెంకటనారాయణ, జలదంకి ఎస్‌ఐలతీవున్నీషా పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ఆండాళమ్మ, గోదాదేవి కళ్యాణం



**బుచ్చి జనవరి 13 ప్రభాతవార్త** బోగి పండుగ పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండ రామస్వామి వారి సన్నిధిలో అత్యంత భక్తి శ్రద్ధల నడుమ శ్రీ ఆండాళమ్మ, గోదాదేవి కళ్యాణం జరిగింది . మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో కళ్యాణంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్లమురళీకృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షిం చారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అన్నారెడ్డిపాళెంలో వేడుకగా జ్యోతి నిమజ్జనం



**సంగం డిసెంబర్ 13 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో జ్యోతి నిమజ్జన కార్యక్రమం అత్యంత వేడుకగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుండి నగర సంకీర్తన చేసి ఏటా బోగి పండుగ రోజు జ్యోతినిమజ్జనం చేయడం ఆనవాయితీఅత్యంత భక్తి శ్రద్దలతో చిన్నపిల్లలు, మహిళలు, ప్రజలు సదరన్ ఛానల్‌లలో జ్యోతి నిమజ్జనం చేశారు. ఆత్మరామస్వామి దేవస్దానం వద్ద నుండి ప్రారంభం అయిన ఉరేగింపు సదరన్ చానల్ వరకు వేడుకగా సాగింది.

## మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**సంగం జనవరి 13 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగం బస్టాండ్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించా రు. వైసిపి నాయకులు కేకు కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఖరిముల్లా వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు




**నెల్లూరు, జనవరి 13, ప్రభాత వార్త – కలెక్టరేట్** సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో కెవిఎస్ పెయింట్స్ సహకారంతో స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ వికలాంగులు, అనాథలు, వృద్ధుల వసతి గృహము ఆశ్రమం నందు భోగి సందర్భంగా చిన్నారులకు భోగి పండ్లు వేయడం జరిగింది. అనంతరం గాలిపటాలు పంపిణీ చేయడం జరిగింది. చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింహపురి సోషల్ సర్వీస్ సభ్యులు పాల్గొన్నారు.

## మకర సంక్రాంతి మీకు, మీ కుటుంబాలకు శుభములు తేవాలి



**కందుకూరు, జనవరి 13, ప్రభాతవార్త** మకర సంక్రాంతి శుభములు మీకు మీ కుటుంబాలకు భోగ భాగ్యాలను ఆయురారోగ్యాలను సుఖసంతోషాల శుభములు తీసుకువస్తుందని కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ అభిలాషించారు. సంక్రాంతి పర్వదినాన సూర్య భగవానుడు దక్షిణయానం నుండి ఉత్తరాయానంలోకి ప్రవేశిస్తున్న శుభ సందర్భంగా గంగా, యమునా, గోదావరి, కృష్ణ కావేరి, పవిత్ర నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆధ్యాత్మిక సామరస్యతతో మెలగాలని కోరారు. పంటలు చేతికంది ప్రజలందరూ సిరిసంపదలతో తులతూగాలని సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోలినేనిపాలెంలో పారిశుధ్యచర్యలు



**వలేటివారిపాలెం జనవరి 12, ప్రభాతవార్త** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలినేనిపాలెం సర్పంచ్ అమరేశ్వరి సుబ్బారావు ప్రజలకు సూచించారు. ఇందులోబాగంగా సోమవారం గ్రామంలో సిబ్బంది పారిశుధ్యచర్యలు చేపట్టారు. శానిటైజేషన్ చేయించారు. బ్లీచింగు చల్లారు మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుతొలగించారు. గ్రామంలో రానున్న సీజనల్ వ్యాధులపట్ల గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వ్యర్ధపదార్దాలను నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లుతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

